కాశీబుగ్గ: కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి కొండా సురేఖ

వంద రోజుల్లో అమలు చేస్తాం

- అర్హులందరికీ సంక్షేమ ఫలాలు
- ప్రజాపాలన కార్యక్రమంలో మంత్రి కొండా సురేఖ

వరంగల్ చౌరస్తా/కరీమాబాద్/ పోచమ్మమైదాన్/కాశీబుగ్గ, జనవరి 5 : సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో రూపొందించిన సంక్షేమ పథకాల ఫలితాలను అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి అందజేస్తామని రాష్ట్ర అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. శుక్రవారం 36వ డివిజన్ జమాతే ఇస్లాం హింద్ హాల్, ఉర్సు సీఆర్సీ, 19వ డివిజన్ స్వశక్తి భవన్, దేశాయిపేట, 34వ డివిజన్ భూపేష్‌నగర్‌లో ప్రజాపాలన కార్యక్రమానికి మున్సిపల్ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషాతో కలిసి దరఖాస్తులను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించి వారికి రసీదులను అందజేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రకటించిన విధంగానే ఆరు గ్యారెంటీల అమలు కోసమే దరఖాస్తులు తీసుకుంటున్నామని చెప్పారు. దరఖాస్తులను పరిశీలించి అర్హులను గుర్తిస్తామన్నారు. వంద రోజుల వ్యవధిలోనే గ్యారెంటీలను అమలు చేసి చూపిస్తామన్నారు. రాజకీయాలకు అతీతంగా అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందజేసేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. అందుకు అనుగుణంగా కార్యాచరణ సైతం సిద్ధం చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎండీ ఇక్బాల్, పోపా రాష్ట్ర అధ్యక్షుడు శామంతుల శ్రీనివాస్, కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షులు షేక్ సోహైల్, నియోజకవర్గ నాయకుడు చాంద్ పాషా, మాజీ కార్పొరేటర్లు బత్తిని వసుంధర, కత్తెర శాల వేణుగోపాల్, కేడల పద్మ, నాయకులు అక్తర్, చీర అరుణ, కరాటే ప్రభాకర్, డివిజన్ అధ్యక్షుడు దాసరి రాజేశ్ పాల్గొన్నారు.

దేశాయిపేటలోని శ్రీ రంగనాయక స్వామి ఆలయ అభివృద్ధి కోసం కృషిచేస్తానని సురేఖ తెలిపారు. ఆలయం గురించి పూజారులు కొండపాక రంగాచార్య, శ్రీనివాసాచార్య, విష్ణుతేజ వివరించగా అభివృద్ధి కోసం రూ.10లక్షలు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు.

పార్ట్‌టైం జాబ్ పేరుతో రూ.37 లక్షలు ఫట్

సుబేదారి : పార్ట్‌టైం జాబ్ కోసం ఓ యువకుడు ఆన్‌లైన్ ఇన్వెస్ట్‌మెంట్ పేరుతో సైబర్ నేరస్తుడి చేతిలో చిక్కి రూ.37లక్షలు పోగొట్టుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పెద్దమ్మగడ్డకు చెందిన అన్వేష్ ఫోన్‌కు గతేడాది అక్టోబర్ 11న పార్ట్‌టైం జాబ్ పేరుతో మెసేజ్ వచ్చింది. ఆ లింక్ ఓపెన్ చేయగా 'తక్కువ డబ్బు పెట్టుబడి పెడితే ఎక్కువ డబ్బులు సంపాదించవచ్చు' అని సైబర్ నేరస్తుడు చేసిన ఆన్‌లైన్ చాటింగ్‌ను నమ్మి దశలవారీగా ఇప్పటివరకు రూ.37లక్షల 59వేల 924 పెట్టుబడి పెట్టాడు. తీరా అకౌంట్ బ్లాక్ చేయడంతో బాధితుడు అన్వేష్ మోసపోయానని గ్రహించి శుక్రవారం హనుమకొండ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

- పరిశోధనలు, ప్రయోగాల విస్తరణ కోసం రీసెర్చ్ పార్క్
- వ్యవసాయరంగానికి టెక్నాలజీ అనుసంధానం
- అగ్రికల్చర్ ఇంజినీరింగ్ కోర్సులకు ప్రణాళిక
- 100 ఎకరాల్లో అదనపు ఏర్పాట్లు
- భూమి కోసం ప్రభుత్వానికి ప్రతిపాదన
- ఇటీవల హనుమకొండ కలెక్టర్‌ను కోరిన నిట్ డైరెక్టర్
- ప్రస్తుతం నిట్‌కు 248 ఎకరాలు
- భవిష్యత్ అవసరాలకు తగినట్లుగా ప్రణాళిక

వరంగల్ నగరంలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ క్యాంపస్

వ్యవసాయానికి సాంకేతిక దన్ను

సాగులో పరిశోధనల విస్తృతి కోసం వరంగల్ నిట్ చర్యలు

భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా, ముఖ్యంగా వ్యవసాయరంగానికి మరింత సాంకేతిక ఊతమిచ్చే విధంగా వరంగల్‌లోని నిట్ (నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ)ను తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు సిద్ధమయ్యాయి. ఇక్కడ సాంకేతిక పరిశోధనలను విస్తృతం చేయడంతో పాటు సాగురంగానికి వీటిని అనుసంధానం చేసేలా ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటుకు అడుగులు పడుతున్నాయి. ఈ మేరకు అవసరమైన నిర్మాణాల కోసం మరో 100 ఎకరాలు కేటాయించాలని డిసెంబర్ 3న హనుమకొండ కలెక్టర్‌ను నిట్ డైరెక్టర్ బిద్యాదర్ సుబుధి కోరారు. నిట్‌లో శాటిలైట్ క్యాంపస్ విస్తరణ ప్రణాళిక ఉన్నదని పేర్కొన్నారు. 25కిలోమీటర్ల పరిధిలో ఉన్న ధర్మసాగర్ మండలం దేవునూరు, ముప్పారంలో భూములను వరంగల్ నిట్ ఎక్స్‌టెన్షన్ క్యాంపస్‌కు ఇచ్చేలా హనుమకొండ జిల్లా అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు.

- వరంగల్, జనవరి 5 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)

తెలంగాణ ఏర్పాటు తర్వాత కేసీఆర్ ప్రభుత్వం అమలు చేసిన విధానాలతో వ్యవసాయరంగం సమగ్రంగా అభివృద్ధి చెందింది. ప్రతి ఎకరాకు సాగునీరు, ఉచిత కరెంటు, పెట్టుబడి సాయం అందడంతో పంటల విస్తీర్ణం, ఉత్పత్తి అనూహ్యంగా పెరిగాయి. వరంగల్ నిట్ సమీపంలో ఉమ్మడి వరంగల్, ఉమ్మడి కరీంనగర్ జిల్లాల్లో రికార్డు స్థాయిలో పంటల దిగుబడులు వస్తున్నాయి. ఈ క్రమంలో సాంకేతికతను అనుసంధానం చేసి వ్యవసాయానికి మరింత తోడ్పాటును అందించేందుకు వరంగల్ నిట్ ప్రణాళికలు రూపొందిస్తున్నది. వరంగల్‌లోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం అనుసంధానంతో ఇప్పటికే డ్రోన్ రీసెర్చ్ సెంటర్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. పంటల వారీగా అవసరమైన సాంకేతికతను అభివృద్ధి చేసేందుకు వీలుగా నిట్‌లోనూ అగ్రికల్చర్ ఇంజినీరింగ్ కోర్సులను అమలు చేసేందుకు ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. వ్యవసాయంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా కావాల్సిన వాహనాలు, యంత్రాలు, పరికరాల ఆవిష్కరణ, తెలంగాణలో పరిస్థితులకు అనుగుణంగా వ్యవసాయానికి ఉపయోగపడే ఇతర పరిశోధనలు చేసేలా ఈ కోర్సులు ఉండనున్నాయి.

వ్యవసాయంతో పాటు రైల్వే ఇంజినీరింగ్ కోర్సులు

ప్రస్తుతం 248 ఎకరాల్లో బోధన, వసతి సౌకర్యాలు, అధునాతన పరిశోధన కేంద్రాలు, ప్రయోగశాలలు, సెంట్రల్ లైబ్రరీ, స్టూడెంట్ సెంటర్లతో వరంగల్ నిట్ కొనసాగుతున్నది. ఇంజినీరింగ్, సాంకేతిక నైపుణ్యాల హబ్‌గా అభివృద్ధి చెందిన వరంగల్ నిట్, కొత్త ఆవిష్కరణలు, పరిశోధనలు, పరిశ్రమల అనుబంధ కోర్సులు అందిస్తూ అగ్రశ్రేణిగా గుర్తింపు పొందింది. అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన డొమైన్లలో ఈ సంస్థ పూర్వ విద్యార్థులు ఎక్కువ సంఖ్యలో ఉన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న నిట్‌లలో వరంగల్ నిట్ మంచి ఫలితాలతో 17వ స్థానంలో ఉన్నది. వరంగల్ నిట్‌లో రూపొందిన ఈ-వాహనాలు, సైబర్ సెక్యూరిటీ సొల్యూషన్స్ ఇప్పటికే జాతీయ స్థాయిలో గుర్తింపు పొందాయి. ఈ క్రమంలో భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా వరంగల్ నిట్‌ను అభివృద్ధి చేసేందుకు కార్యాచరణ రూపొందించారు. శాటిలైట్ క్యాంపస్ ఏర్పాటుకు అనుగుణంగా కోర్సును రూపొందిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'ఉన్నత్ భారత్ అభియాన్'లో భాగంగా గ్రామాలను దత్తత తీసుకుని వ్యవసాయ రంగానికి సాంకేతికతను అనుసంధానం చేసే ప్రక్రియ కీలకంగా ఉండనుంది. వ్యవసాయంతో పాటు, రైల్వే రంగంలోనూ పరిశోధనల కోసం రైల్వే ఇంజినీరింగ్ కోర్సులు ప్రవేశపెట్టేందుకు వరంగల్ నిట్ ప్రణాళికలు రూపొందిస్తున్నది.

విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్

10న పార్లమెంట్ నియోజకవర్గ సమీక్ష

- గెలిస్తే పొంగిపోను.. ఓడితే కుంగిపోను
- నిరంతరం ప్రజల మధ్య ఉంటా..
- ఎన్నికల్లో గెలుపోటములు సహజం
- బీఆర్ఎస్‌పై కాంగ్రెస్ ఆరోపణలు ఖండిస్తున్నా
- ఎంపీ ఎన్నికల్లో గులాబీ జెండా ఎగురవేద్దాం
- హనుమకొండ బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్

హనుమకొండ, జనవరి 5 : ఈ నెల 10న హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆధ్వర్యంలో వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ సమీక్ష నిర్వహిస్తున్నారని హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ తెలిపారు. సమావేశానికి డివిజన్‌కు ముగ్గురు చొప్పున 90మంది కార్యకర్తలను వెళ్లనున్నారన్నారు. బాలసముద్రంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో గెలుపోటములు సహజమన్నారు. గెలిస్తే పొంగిపోను.. ఓడితే కుంగిపోయేది లేదని పేర్కొన్నారు. ప్రజల మధ్యే ఉంటూ వారి కష్టసుఖాల్లో పాలు పంచుకుంటానని, అంబేద్కర్ ఆశయాల మేరకు సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి దేశానికే తెలంగాణను ఆదర్శంగా నిలిపిన మహనీయుడు మాజీ సీఎం కేసీఆర్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను కప్పిపుచ్చుకొనేందుకు బీఆర్ఎస్‌పై ఆరోపణలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కక్షపూరితంగా వ్యవహరిస్తున్న కాంగ్రెస్ అభివృద్ధికి ఆటంకం కలిగించొద్దని హితవు పలికారు. రాబోయే ఎంపీ ఎన్నికల్లో గులాబీ జెండా ఎగురవేయాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు నెరవేర్చకుంటే పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో కుడా మాజీ చైర్మన్లు మర్రి యాదవరెడ్డి, సుందర్‌రాజ్ యాదవ్, పశ్చిమ నియోజకవర్గ కన్వీనర్ జనార్దన్ గౌడ్, కార్పొరేటర్లు బొంగు అశోక్ యాదవ్, చెన్నం మధు, సోదా కిరణ్, సంకు నర్సింగ్, ఇమ్మడి లోహితారాజు, ఎలకంటి రాములు, గుంటి రజిత, పులి రజనీకాంత్, ఉడుతల సారంగపాణి, విష్ణువర్ధన్‌రెడ్డి, సుగుణాకర్‌రెడ్డి, కేశవరెడ్డి, రజిత తదితరులు పాల్గొన్నారు.

ఏసీబీ వలలో కేయూ అసిస్టెంట్ రిజిస్ట్రార్

కేయూలో ఏసీబీకి పట్టుబడిన అసిస్టెంట్ రిజిస్ట్రార్ కిష్టయ్య

- రూ.50 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడిన కిష్టయ్య
- మెస్ బిల్లుల చెల్లింపుల్లో చేతివాటం
- గతంలోనూ రూ.50వేలు తీసుకున్నట్లు సమాచారం

హనుమకొండ చౌరస్తా, జనవరి 5 : కాకతీయ యూనివర్సిటీ అసిస్టెంట్ రిజిస్ట్రార్, ఆడిట్ ఆఫీసర్ సంగ సారపు కిష్టయ్య ఏసీబీకి చిక్కాడు. రూ.50 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు శుక్రవారం రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఏసీబీ డీఎస్పీ సాంబయ్య తెలిపిన వివరాల ప్రకారం.. కేయూలో 2021-22, 23 సంవత్సరానికి హాస్టళ్లలో పాలు, పెరుగు సరఫరా చేసేందుకు కాంట్రాక్టర్ పెండెం రాజేందర్ టెండర్ దక్కించుకున్నాడు. మే, ఏప్రిల్‌కు సంబంధించిన రూ.9 లక్షల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. వాటిని ఇచ్చేందుకు అసిస్టెంట్ రిజిస్ట్రార్, ఆడిట్ ఆఫీసర్ కిష్టయ్య రాజేందర్‌ను లంచం డిమాండ్ చేశాడు. రాజేందర్ సమాచారంతో కిష్టయ్యను ఏసీబీ అధికారులు ట్రాప్ చేశారు. లంచం తీసుకుంటుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు తెలిపారు. గతంలో కూడా పాల కాంట్రాక్టర్ నుంచి యూపీఐ ద్వారా రూ.50 వేలు లావాదేవీలు ఉన్నట్లు సమాచారం. దీని వెనుక ఉన్నవారిపై ఏసీబీ అధికారులు పూర్తిస్థాయిలో విచారణ జరుపుతున్నారు. ఒక్క హాస్టల్‌లోనే కాకుండా కిష్టయ్యపై అనేక ఆరోపణలు వినిపిస్తున్నాయి. యూనివర్సిటీలో కీలకమైన నాలుగు కార్యాలయాలకు కిష్టయ్య ఒక్కడినే అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా వీసీ నియమించారనే ఆరోపణలు సైతం ఉన్నాయి. కిష్టయ్య భార్య ఆర్ట్స్ కాలేజీలో పార్ట్‌టైం సోషియాలజీ లెక్చరర్‌గా విధులు నిర్వహిస్తుండడం విశేషం.

బిల్లులో 10 శాతం ఇవ్వాలన్నాడు

- పెండం రాజేందర్, కాంట్రాక్టర్

కేయూలో మూడేళ్లుగా నాలుగు హాస్టళ్లలో పాలు, పెరుగు సరఫరా చేస్తున్నా. గత సంవత్సరం ఏప్రిల్, మే బిల్లులు ఇవ్వకుండా అసిస్టెంట్ రిజిస్ట్రార్, ఆడిట్ ఆఫీసర్ కిష్టయ్య నిలిపివేశాడు. ఈ విషయాన్ని యూనివర్సిటీ రిజిస్ట్రార్ శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లగా పిలిపించి అడిగితే చెల్లిస్తానన్నాడు. మళ్లీ ఇప్పుడు బిల్లులు ఎందుకివ్వాలి.. మాకు కూడా ఖర్చులు ఉంటాయి. అందరూ ఇస్తున్నారు. నువ్వు కూడా రూ.50 వేలు ఇస్తేనే రూ.3 లక్షల బిల్లులు ఇస్తానడంతో ఏసీబీ అధికారులకు పట్టించా.

బీకాం సెమిస్టర్ పేపర్‌లో ఒకే ప్రశ్న రెండుసార్లు

మూడు మార్కులు కలుపుతామని కేయూ పరీక్షల నియంత్రణాధికారి వెల్లడి

హనుమకొండ చౌరస్తా జనవరి 5 : కేయూ పరిధిలో గురువారం జరిగిన డిగ్రీ బీకామ్ ఐదో సెమిస్టర్ పేపర్-3 ప్రశ్నపత్రంలో ఒకే ప్రశ్న రెండుసార్లు వచ్చినందుకు ప్రతి విద్యార్థికి మూడు మార్కులు అదనంగా అవార్డు చేస్తూ నిర్ణయం తీసుకున్నామని పరీక్షల నియంత్రణాధికారి మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి తిరుమలాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం సెషన్‌లో జరిగిన బీకామ్ ఐదో సెమిస్టర్ పేపర్-3 'ఈ కామర్స్‌లోని షార్ట్ క్వశ్చన్లలో ఒక ప్రశ్న రెండుసార్లు రిపీట్ అయిందని విద్యార్థులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ తప్పిదంపై నిబంధనల ప్రకారం సంబంధిత ఉద్యోగులపై చర్యలు కూడా ఉంటాయని వారు తెలిపారు.

ఒక్కడి తప్పు 145మందికి చుట్టుకుంది

ఫోన్‌పే పాస్‌వర్డ్ తస్కరించి డీఈ కారు డ్రైవర్ ఘరానా మోసం

- అతడి అకౌంట్‌కు రూ.80వేల ట్రాన్స్‌ఫర్
- బాధితుడి ఫిర్యాదుతో 145 బ్యాంకు అకౌంట్లు ఫ్రీజ్
- పోలీస్‌స్టేషన్ చుట్టూ తిరుగుతున్న బ్యాంకు ఖాతాదారులు

సుబేదారి, జనవరి 5 : డీఈ కారు డ్రైవర్ చేసిన మోసానికి 145 మంది బ్యాంకు అకౌంట్లు ఫ్రీజ్ అయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలం బుద్దారం గ్రామానికి చెందిన యువకుడు హనుమకొండలో డీఈ వద్ద కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. డీఈ ఫోన్‌పే పాస్‌వర్డ్ తెలుసుకొని డిసెంబర్‌లో తన అకౌంట్‌కు రూ.80వేలు ట్రాన్స్‌ఫర్ చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న డీఈ కుమారుడు డిసెంబర్ 19న సైబర్ క్రైమ్ టోల్‌ఫ్రీ నంబర్ 1930కి ఫిర్యాదు చేశాడు. దీంతో స్టేట్ సైబర్ సెక్యూరిటీ పోలీసులు డ్రైవర్ సెల్‌ఫోన్ నుంచి ఫోన్‌పే, గూగుల్‌పే ద్వారా లావాదేవీలు చేసిన 145 మంది బ్యాంకు ఖాతాలను ఫ్రీజ్ చేశారు. డీఈ సుబేదారి పోలీస్ స్టేషన్ పరిధి నివాసి కావడంతో కేసును స్టేట్ సైబర్ సెక్యూరిటీ పోలీసులు ఇక్కడి పోలీసులకు సమాచారం అందించారు. కాగా, డ్రైవర్ నిర్వాకంతో అకౌంట్స్ ఫ్రీజ్ అయిన వారు పోలీసు స్టేషన్‌కు పరుగులు పెడుతున్నారు. తీరా అక్కడికి వెళ్లాక ఖాతాదారులను ఆధార్, పాన్‌కార్డు, అఫిడవిట్ తీసుకురావాలని చెప్పడంతో వారంతా తలలు పట్టుకుంటున్నారు. ఒక్కడు చేసిన తప్పుకు ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. కాగా, ఆన్‌లైన్ మనీ ట్రాన్స్‌ఫర్‌కు పాల్పడిన డ్రైవర్ కోసం గాలిస్తున్నామని పోలీసులు చెబుతున్నారు.

బాలికపై లైంగికదాడి కేసులో 20 ఏళ్ల జైలు

జనగామ చౌరస్తా, జనవరి 5 : పోక్సో కేసులో ఓ వ్యక్తికి కోర్టు 20 ఏండ్ల జైలు శిక్ష విధించింది. జనగామ మండలంలోని చీటకోడూరుకు చెందిన వడ్లకొండ ప్రసాద్ అలియాస్ బొట్ల ప్రసాద్ 2019లో ఓ బాలికపై లైంగిక దాడికి పాల్పడినట్లు శుక్రవారం జిల్లా కోర్టులో నేరం రుజువైంది. దీంతో అతడికి 20 ఏళ్ల జైలు శిక్షతోపాటు రూ.80వేల జరిమానా విధిస్తూ జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి డీ రవీంద్రశర్మ తీర్పునిచ్చినట్లు అర్బన్ సీఐ ఎల బోయిన శ్రీనివాస్ తెలిపారు. ఈ కేసుకు స్పెషల్ పీపీగా ఎం స్టీవెన్, ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్లుగా పూర్వపు ఏసీపీ వినోద్‌కుమార్, ప్రస్తుత అర్బన్ సీఐ శ్రీనివాస్ వ్యవహరించారు. కోర్టు లైజన్ ఆఫీసర్‌గా ఏఎస్సై పీ సారంగపాణి, పీసీలు బీ రమేశ్, ఎస్ తిరుపతి పాల్గొన్నారు.

అమ్మ అని మరిచి..

- మతిస్థిమితం తప్పి తల్లిని చంపిన కొడుకు
- రోకలిబండతో కొట్టి దారుణం
- అడ్డు వచ్చిన మరో మహిళ పైనా దాడి.. పరిస్థితి విషమం
- రేగొండ మండలం తిరుమలగిరిలో ఘోరం
- పోలీసుల అదుపులో నిందితుడు

హైమ (ఫైల్)

రేగొండ, జనవరి 5 : మతిస్థిమితం తప్పిన ఓ కొడుకు ఆగ్రహంతో ఊగిపోతూ కన్నతల్లినే రోకలిబండతో కొట్టిచంపాడు. అడ్డుగా వచ్చిన మరో మహిళపైనా దాడి చేయగా ఆమె చావుబతుకుల మధ్య దవాఖానలో కొట్టుమిట్టాడుతున్నది. భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం తిరుమలగిరిలో శుక్రవారం తెల్లవారుజామున జరిగిన ఈ ఘోరం ఉమ్మడి జిల్లాలో కలకలం రేపింది. కుటుంబసభ్యులు, చిట్యాల సీఐ వేణుచందర్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కంచరకుంట్ల రాజిరెడ్డి, పదేళ్ల క్రితం మతిస్థిమితం కోల్పోయాడు. అప్పటినుంచి వైద్యుల సూచనల మేరకు మందులు వాడుతున్నాడు. ఈ క్రమంలో నెల రోజులుగా మళ్లీ పిచ్చిగా ప్రవర్తిస్తూ కుటుంబసభ్యులతో తరచూ గొడవపడుతూ కొట్టేవాడు. గురువారం రాత్రి కూడా కుటుంబసభ్యులపైకి ఆగ్రహంతో ఊగిపోయాడు. చంపుతాడేమోనన్న భయంతో రాజిరెడ్డి భార్య, అమ్మమ్మ, అమ్మ కలిసి ఒక గదిలోనే తలుపులు గడియపెట్టుకొని ఉండిపోయారు. ఈ క్రమంలో తలుపులు తీయాలంటూ రాజిరెడ్డి గొడవపడ్డాడు. ఇంటిని, ఇంటి ఆవరణలో ఉన్న వరి గడ్డిని తగులబెట్టానని బెదిరించడంతో అతడి తల్లి హైమ(63) భయపడి తలుపు తీయగా రోకలిబండతో ఒక్కసారిగా దాడి చేయడంతో ఆమె అక్కడికక్కడే చనిపోయింది. రాజిరెడ్డి భార్య తప్పించుకోగా ఏదో గొడవ జరుగుతున్నదని చూసి అక్కడికి వచ్చిన పక్కింటి మహిళ జ్యోతిపైనా అతడు దాడి చేశాడు. అనంతరం రోకలిబండ, గొడ్డలి చేతపట్టుకొని గ్రామంలో తిరుగుతూ భయభ్రాంతులకు గురిచేశాడు. గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో రేగొండ ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి చేరుకొని 108 అంబులెన్స్‌లో జ్యోతిని వరంగల్ ఎంజీఎం వైద్యశాలకు తరలించారు. రాజిరెడ్డి చిన్న కోడెపాకలో కనిపించడంతో గ్రామస్తులు తాళ్లతో బంధించినట్లు తెలుసుకొన్న పోలీసులు అక్కడికి వెళ్లి అతడిని అదుపులోకి తీసుకున్నారు. ప్రస్తుతం జ్యోతి పరిస్థితి విషమంగా ఉంది. నిందితుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేయగా, భూపాలపల్లి డీఎస్పీ రాములు ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు.

నిందితుడు రాజిరెడ్డిని తాళ్లతో కట్టేసి పట్టుకున్న గ్రామస్తులు

ఆస్తి కోసం కన్నతండ్రిని మట్టుబెట్టి..

బండరాయితో కొట్టి చంపిన కొడుకు

- మద్యం మత్తులో దారుణం.. వాటా విషయంలో గొడవ
- గూడూరు మండటం తీగలవేణిలో ఘటన

గూడూరు, జనవరి 5 : ఆస్తి కోసం కన్న తండ్రిని దారుణంగా హత్య చేశాడో కొడుకు. మద్యం మత్తులో గొడవ పెట్టుకుని బండరాయితో కొట్టి అంతమొందించాడు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం తీగలవేణి గ్రామంలో గురువారం సాయంత్రం జరుగగా ఆలస్యంగా వెలుగుచూసింది. ఎస్సై రాణాప్రతాప్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన లింగాచారి(70)కి భార్య, ముగ్గురు కుమారులు, కుమార్తె ఉన్నారు. గ్రామ శివారులోని తన సొంత వ్యవసాయ క్షేత్రంలో ఉన్న గుడిలో వంశపారంపర్యంగా వస్తున్న పూజారిగా పనిచేస్తున్నాడు. తనకున్న ఆస్తిని సంతానానికి పంచాడు. అయితే చిన్న కుమారుడు రమేశ్ తనకు ఆస్తి సరిగా పంచలేదని కోపం పెంచుకున్నాడు. ఈ క్రమంలో మద్యం మత్తులో గురువారం సాయంత్రం తండ్రితో గొడవపెట్టుకున్నాడు. అనంతరం తండ్రి తలపై బండరాయితో మోది చంపేశాడు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడి పెద్ద కుమారుడు బ్రహ్మచారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

ఎంజీఎంలో మరో రెండు కరోనా కేసులు

వరంగల్ చౌరస్తా, జనవరి 5: వరంగల్ ఎంజీఎం దవాఖానలోని కొవిడ్ వార్డులో శుక్రవారం మరో రెండు కరోనా కేసులు నమోదయ్యాయి. ఇటీవల చికిత్స కోసం పలువురు దవాఖానకు రాగా, సేకరించిన నమూనాలను కేఎంసీలోని వైరాలజీ ల్యాబ్‌కు పంపారు. అందులో ఇద్దరికి కరోనా జేఎన్.1గా నిర్ధారించారు. ప్రస్తుతం కొవిడ్ వార్డులో ముగ్గురు చికిత్స పొందుతున్నట్లు ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్ తెలిపారు.

ఫ్లైట్ టికెట్లు బుక్ చేస్తే రూ.2.35 లక్షలు కట్

సుబేదారి, జనవరి 5 : హనుమకొండ లష్కర్ సింగారం ప్రాంతానికి చెందిన అహ్మద్‌అలీ కెనడా వెళ్లేందుకు శుక్రవారం ఇండియన్ ఎయిర్‌లైన్స్ ఫ్లైట్ టికెట్లు కొనుగోలు చేయడానికి ఆన్‌లైన్‌లో రూ.2.35లక్షలు చెల్లించాడు. టికెట్లు బుక్ కాకుండా డబ్బులు అతడి అకౌంట్ నుంచి విత్‌డ్రా కావడంతో మోసపోయానని తెలుసుకొని హనుమకొండ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.